# మహానగరం కథలు

## -వేదుల సుభద్ర



*మహానగరం కథలు*

**ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా.** ఉన్నది ఎక్కడైనా, తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహాకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ, స్వార్ధమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్థికసంబంధాలే జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కథా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు.. ఈ మహానగరం కథలు..!!

# ‘ఏదేశమైనా’

‘ఏదేశమైనా’

" ఈ రోజు పిల్లలు మనల్ని ఎక్కడికి తీసుకెళ్తున్నారో, నీకేమైనా తెలుసా?" అడిగాడు అరుణ్ భార్యని.

" లేదుగా! నాకు చెప్పనేలేదు. సాయంత్రం రెడీ గా ఉండు అన్నారు, అంతే" అంది ఆవిడ తన నల్లటి స్కర్ట్ మీద వేసుకున్న పింక్ బ్లవుజ్ మీద చిన్న రాళ్ళ బ్రోచ్ అమర్చుకుంటూ.

" హ్మ్! ఏమిటి వీళ్ళ ప్లాన్ అయితే? నా కర్థం కాలేదు" అన్నాడు అరుణ్ మళ్ళీ.

" కాసేపాగితే తెలుస్తుంది కదా! ఇంతలో కంగారు పడడం ఎందుకు? వయసు పెరుగుతున్నకొద్దీ చాదస్తం పెరుగుతోంది" అంది ఆవిడ నవ్వుతూ.

" ఏమిటో, నీకు మాత్రం వయసు పెరుగుతున్న కొద్దీ, అందం మరింత పెరుగుతోంది సుమా!" అన్నాడామెని దగ్గరకు తీసుకుంటూ. అందంగా నవ్వింది ఒలివియా.

"నిజంగా ఒలీ, ఈ ముప్పై సంవత్సరాలలో మనజీవితంలో ఎన్నో మార్పులు జరిగాయి, మారనిది మాత్రం మనిద్దరి మధ్యా ఉన్న ప్రేమే! నిజమే కదూ" అన్నాడు అరుణ్ ఆమెతో.

" అవును, నిజమే!" అంది ఒలివియా కూడా. అలా అంటున్నప్పుడామె కళ్ళల్లో చెప్పలేని సంతోషం.

“మన పిల్లలు కూడా మనలాగే ఉండాలని నా కోరిక. ముఖ్యంగా అనిత,” అంది.

" ఐ థింక్ దిస్ ఈజ్ ద మొమెంట్" అంటూ వచ్చారు వాళ్ళ పిల్లలు ముగ్గురూ నీల్, అనిత, లూకాస్. ముగ్గురి చేతుల్లో ఉన్న కెమెరాలతో, ఫోన్లతో ఫోటోలు తీశారు.

" హాయ్ చిల్డ్రన్" అన్నాడు అరుణ్ నవ్వుతూ. ఒలివియా కూడా వాళ్ళని పలకరించింది.

" కాసేపట్లో మనం బయటకు వెళ్తున్నాం," చెప్పాడు అందరిలోకి పెద్దవాడైన ఇరవై ఏడేళ్ళ నీల్.

" ఎక్కడికో చెప్పకూడదా నీల్? డాడ్ వాంట్స్ టు నో" అంది ఒలివియా.

" దట్స్ ఓకే, హి కెన్ వెయిట్ ఏ బిట్" అన్నాడు నీల్ నవ్వుతూ.

మరో రెండు గంటల తర్వాత నీల్ డ్రైవ్ చేస్తూ ఉంటే, అందరూ బయటకి బయలు దేరారు.

“ చాలా రోజుల తర్వాత అందరం ఒకే కార్ లో వెళుతున్నాం కదా" అంది ఒలివియా.

" అవును! వీళ్ళు చిన్నపిల్లలుగా ఉన్నప్పుడు వెళ్ళేవాళ్ళము, అది కూడా మన పాత వాన్ లో!” అన్నాడు అరుణ్.

" నాకా వాన్ ఎంతో బావుండేది నిజానికి" అంది ఒలివియా.

“పిల్లలు పెద్దవాళ్ళవకుండా ఉంటేనే బావుంటుంది అనిపిస్తుంది కదా!” అంది మళ్ళీ తనే.

" అలా ఎప్పటికీ యంగ్ గా ఉండిపోవాలని నీ ఆశ కదూ!!” అంది అనిత. అందరూ నవ్వారు ఆ మాటలకి.

" ఆ అవసర మే లేదు తనకి. ఎన్నేళ్ళు గడిచినా మీ అమ్మ నాకళ్ళల్లో, మనసులో ఇప్పటికీ, అప్పటిలాగే ఉంటుంది అనీ!" అన్నాడు అరుణ్ చిరునవ్వుతో.

" హౌ స్వీట్! యూ ఆర్ ఏన్ అమేజింగ్ లవర్ డాడ్. మాం ఈజ్ వెరీ లక్కీ, ఇలా ఎలా ఉండగలరు మీరు? అంది అనిత తండ్రి భుజమ్మీద తల వాల్చుతూ.

" అవును డాడ్, మీరు ఎప్పుడూ మీ లవ్ స్టోరీ చెప్పనే లేదు" అన్నాడు లూకాస్.

"మీ ఇండో స్వీడిష్ లవ్ స్టోరీ మేము ఎప్పుడూ స్వీట్  అడగనేలేదు. ఈ రోజు మీరు చెప్పాల్సిందే" అన్నాడు లూకాస్ వెనక సీట్లో కూర్చున్న అమ్మా, నాన్నలవైపు చూస్తూ.

"మొన్ననే ఫేస్ బుక్ లో వచ్చింది కదా ఇండియా నించీ ఒకాయన తన ప్రేయసి కోసం నాలుగు నెలల పైన సైకిల్ తొక్కుకుంటూ స్వీడన్ కి వచ్చి, ఆమెని పెళ్ళి చేసుకున్నారని. అలాంటి స్టోరీయేనా మీది?" అంది అనిత కూడా.

అరుణ్, ఒలివియా ఇద్దరూ నవ్వారు ఆ మాటలకి.

"ఎలాంటిదైనా,  ఎవరి కథ వారికి ప్రత్యేకమే కదూ!  నేను చెప్తాను, మా కథ "అంది ఒలివియా.

"మేమిద్దరం తొలిసారి కలిసినది వాసా మ్యూజియం లో. మీకు తెలుసు కదా వాసా ప్రత్యేకత. మా నాన్న అందులో పని చేశేవారు. అందుకే నేనూ, మా అన్న ఎరిక్ అప్పుడప్పుడూ అక్కడకు వెళ్తూ ఉండేవాళ్ళం. ఎన్ని సార్లు విన్నా కూడా ఆ నౌక చరిత్ర మాకు ఎంతో అధ్భుతంగా అనిపించేది. అందులోనూ నాన్న చాలా బాగా, అందరికీ అర్థం అయ్యేట్టుగా  వివరించి మరీ చెప్పేవారు. "అంది ఒలివియా.

" అవును! ఆయనే మాకు చెప్పారు. విధ్యార్థులమైన మేము వారాంతంలో సరదాగా నగరం చూడడానికి వెళ్ళేవాళ్ళం. అలా ఒక సారి వాసా మ్యూజియం చూడడానికి వెళ్ళాం.

"స్వీడన్ రాజు ఘౌస్తవ్   అడోల్ఫ్,  పోలాండ్ మీద యుద్ధం చెయ్యటానికి ఒక యుద్ధనౌక ని నిర్మించాలని అనుకున్నాడు. దీనికోసం హెన్రీ అనే ఒక డచ్ ఇంజినీర్ ని నియమించాడు. స్టాక్ హోం షిప్ యార్డులో 1626 లో దీని నిర్మాణం ప్రారంభమై ఒక సంవత్సరం తరువాత  ఆ షిప్ నిర్మాణం పూర్తయ్యింది. దీనికిగాను టన్నుల కొద్దీ ఓక్ వృక్షాల కలపని వినియోగించారు. రాగి మరియు ఇతర లోహాలని వినియోగించారు. ఈ నిర్మాణ కాలంలోనే షిప్ ఆర్కిటెక్ట్ అయిన హెన్రీ అనారోగ్యంతో మరణించాడు.మొత్తం 3 డెక్ లతో ఈ షిప్ నిర్మాణం జరిగింది. 1628 ఆగస్టు 10 వ తేదీన వాసా నౌక పోలాండ్ పై యుద్ధానికి బాల్టిక్ సముద్రపు జలాల్లోకి ప్రవేశించింది. కొన్ని వేలమంది స్వీడన్లు, మిగతా దేశాల అంబాసిడర్లు ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా చూడటానికి విచ్చేశారు. కాని అప్పుడే దురదృష్టవశాత్తూ సముద్రంలోకి ప్రవేశించిన 20 నిమిషాల్లోనే, అందరి కళ్ళ ముందే ఆ నౌక మునిగిపోయింది. కొన్ని వందలమంది అక్కడే జల సమాధి అయిపోయారు. ఏ లక్ష్యంతో అయితే ఆ నౌక ని నిర్మించారో అది నెరవేరకుండానే వాసా మునిగిపోయింది. ఇది స్వీడన్ కి కోలుకోలేని దెబ్బ. ఎందుకంటే దానిమీద పెట్టిన ఖర్చు సామాన్యమైనది కాదు, అదొక్కటే కాక తాము ఇంత కష్టపడి రూపొందించిన నౌక అలా మునిగిపోవడం బాధాకరమే కాక అవమానం కూడా. ఆ నౌకని మళ్ళీ పునరుద్ధరించాలని రక రకాల ప్రయత్నాలు చేసి, దాదాపు 333 సంవత్సరాల తరువాత అతి కష్టమ్మీద ఆ నౌకని వెలుపలికి తీసారు. ఆతర్వాత దాన్ని శుభ్రపరచి మ్యూజియం గా ఏర్పాటు చేశారు." అంటూ చెప్తున్న అరుణ్ ని మధ్యలోనే ఆపి

" ఇదంతా మాకు కూడా తెలుసు, మేము అడిగిన విషయాన్ని చెప్పండి డాడ్" అన్నాడు నీల్ నవ్వుతూ.

ఇవన్నీ పేపర్లలో చదివినా గానీ మీ తాతగారు వర్ణించి చెప్తూ ఉంటే చాలా బావుండేది. ఆయన చెప్పిన మాటలకి నేను ఆకర్షితుడినైపోయాను. " ఆ షిప్ ని అన్నేళ్ళ తర్వాత అంత బృహత్ప్రయత్నంతో బయటకి తియ్యవలసిన అవసరం ఏముంది? ఎందుకు స్వీడన్ వాళ్లకంత పట్టు? అనుకుని ఉండవచ్చు ప్రపంచదేశాలవారు. ఇంత చిన్న దేశానికి, అంత పెద్ద నావ ఒకసారి తయారు చెయ్యడమే ఎక్కువ, మళ్ళీ పునరుద్ధీకరణ కూడానా? అని కొందరు నవ్వుకుని ఉండచ్చు కూడా. కానీ నేను ఈ సంఘటన మొత్తంలో చూసినది కేవలం సంకల్ప బలం, పట్టుదల. నా దేశాన్ని అమితంగా ప్రేమించే నా తోటి దేశస్థుల్లాగే నేను ఈ ప్రయత్నాన్ని చూసి ఎంతో గర్వించాను. అప్పటినిచి 'గివ్ అప్' అనే పదాన్ని నా డిక్షనరీ లోంచి తొలగించేసుకున్నాను ' ఇవే సరిగ్గా మీ తాతగారు  సందర్శకులమైన  మాకు చెప్పిన మాటలు.

అప్పటివరకూ స్టూడెంట్ గా ఆడుతూ పాడుతూ తిరుగుతూ సరదాగా సమయం గడుపుతున్న నాకు మొదటిసారిగా ఏదైనా చెయ్యాలనిపించింది." అన్నాడు.

" అందుకేనా అమ్మని లవ్ చేశావు?" అంది అనిత.

" నాటీ గర్ల్" అంటూ ఆమె తల మీద తట్టాడు. "అమ్మని అప్పటికి నేను చూడలేదు" అన్నాడు.

" కానీ నేను చూశాను అంది ఒలీవియా. ఆ గ్రూప్ లో ఉన్న ఏకైక ఇండియన్ మీ నాన్నే, అందుకే నాకు గుర్తున్నాడు, ప్రత్యేకంగా ఏమీ అనుకోలేదు కానీ ప్రత్యేకంగా కనిపించాడు" అంది.

" ఇంటరెస్టింగ్, ఆ తర్వాత?"అంది అనిత. ముందు కూర్చున్న అన్నదమ్ములిద్దరూ ఒకరినొకరు క్రీగంట చూసుకున్నారు. వారిద్దరి పెదవుల చివరన మెలితిరిగిన సన్నని నవ్వు అరుణ్ దృష్టిని దాటిపోలేదు.

మేమంతా మ్యూజియం టూర్ ముగించుకుని వెళ్ళిపోతూ ఉంటే ' ఎక్స్క్యూజ్ మీ" అంటూ నా వెనకే వచ్చింది.

" అమ్మే కదూ!" అంది అనిత.

" యస్! నా స్కార్ఫ్ అక్కడే మర్చిపోయానుట, అది ఇవ్వడానికే పిలిచింది. నేను వెనక్కి తిరిగి చూస్తే దాన్ని జాగ్రత్తగా మడతపెట్టి చేతిలో పట్టుకుని నిల్చుని ఉంది.

"ఓ! వజ్ దట్ లవ్ ఎట్ ఫస్ట్ సైట్??" అనిత అడిగింది.

" సార్ట్ ఆఫ్! యెస్!' అన్నాడు అరుణ్ నవ్వుతూ. ఒలివియా ప్రేమగా అతని చేతిని పట్టుకుంది.

" ఆ తర్వాత?" అన్నాడు నీల్.

" ఆ తర్వాతేముంది? తన నలుగురు పిల్లల్లోకీ ఎంతో మెత్తని మనసు కలదీ, అమాయకురాలు ఈవిడేననీ, ముక్కూ మొహమూ తెలియని ఒక ఫారినర్ ఇవ్వడం కష్టమని అన్నారు మీ తాతగారు. మా దేశాన్ని గురించీ, కుటుంబాన్ని గురించీ ఎన్నో ప్రశ్నలు అడిగేవారు. అంతే కాదు ఇండియాకి సంబంధించి అనేక విషయాలు పుస్తకాల ద్వారా, మిత్రులద్వారా తెలుసుకున్నారు. ఇంతలో నేను బికీ చక్రబొర్తీ ( స్వీడన్ లో ఇండియా సంతతివాడైన ప్రముఖ సంపన్నుడు) లాంటి వారి స్ఫూర్తితో నా స్వంతంగా వ్యాపారం ప్రారంభించాను. అదృష్టవశాత్తూ అందులో నిలదొక్కుకున్నాను."

" అప్పుడేమయింది? గ్రాండ్ పా ఒప్పుకున్నారా?"

" వెంటనే ఒప్పుకోలేదు, రెండేళ్ళు పట్టింది. ఈ లోపున ఆయన ఇండియా గురించీ, భారతీయుల గురించీ రిసెర్చ్ చేసి, నన్ను రక రకాలుగా పరీక్షించి అప్పుడు ఒప్పుకున్నారు.

" అరుణ్! నాకు మీ దేశంలో బాగా నచ్చినది వివాహ బంధం పట్ల మీకున్న విశ్వాసం, నమ్మకం. నీతో పరిచయం కాకముందు మాకు ఆ దేశాన్ని గురించి ఏమీ తెలియదు. ఒలివియా అమాయకురాలు,. అలాంటి అమ్మాయిని కల కాలం కళ్ళల్లో పెట్టుకుని చూసుకోగలవని నాకనిపిస్తోంది. దానిక్కారణం గత మూడేళ్ళుగా నువ్వు ఆమె కోసమూ, నా అనుమతి కోసం ఎదురు చూస్తూ ఉండడమే. నువ్వు నా బిడ్డని గుండెల్లో పెట్టుకుని చూసుకుంటావు, ఐ యాం వెరీ ష్యూర్!" అన్నారు. ఆ తర్వాత మా పెళ్ళి జరిగింది, మా అమ్మా, నాన్నలు వచ్చారు. ఆతర్వాత నేను, మీ అమ్మా చాలా సార్లు ఇండియా వెళ్ళాము. మీ చిన్నతనంలో కూడా వెళ్ళాము కదా! మీ తాతా, నాన్నమ్మా పోయాకా తగ్గిపోయింది కానీ"అన్నాడు అరుణ్.

"త్రీ ఇయర్స్ ఎదురు చూశారా? ఐ కాంట్ బిలీవ్ ఇట్. ఎలా సాధ్యం? అమేజింగ్! భారతీయుడవడం వల్ల మీకంత ఓపికా? అందుకే మీరింతగా అమ్మని ప్రేమిస్తారా?" అంది అనిత.

" హనీ! స్వతహాగా భారతీయుడినవడం వల్ల నాకు వివాహ బంధం మీదా, వ్యవస్థ మీదా చాలా నమ్మకం. తల్లి తండ్రుల సమక్షంలో, వారి ప్రేమాభిమానాల మధ్య పెరిగిన పిల్లలు మీలా చక్కగా ఉంటారనేది నా విశ్వాసం. దాన్ని పాతకాలపు సిద్ధాంతం అనుకున్నా నాకు పరవాలేదు. ఇదంతా ఒకపక్క. మరో వైపు ఏ బంధాన్నైనా అందంగా మలచుకోవడానికి వ్యక్తులు ముఖ్యం. దానికి ఫలానా దేశం, ప్రాంతం అనే పరిమితులుండవు. అన్నాడు.

" మీ నాన్న చెప్పింది చాలా నిజం" అంది ఒలివియా.

“నేను మీ అమ్మపై చూపించే ప్రేమ గురించే మీరు మాట్లాడుతున్నారు ఇప్పటివరకూ, మరి మీ అమ్మో? ఆమె మనందరికీ పంచే ప్రేమేంత గొప్పదో మనందరికీ తెలియదూ?" అన్నాడు అరుణ్. అనిత ముఖం కళ తప్పడం అరుణ్ తప్ప మరెవరూ చూడలేదు.

మాటల్లో ఉండగానే మళ్ళీ వాసా మ్యూజియం దగ్గరకి చేరున్నారు.

" హాయ్" అంటూ ఎదురు వచ్చాడు ఆలివర్. అతన్ని చూసి అనిత ముఖం చిట్లించింది.

తల్లితో అంది " ఈ ఆనంద సందర్భంలో ఇతనెందుకొచ్చాడిక్కడికి?" అని.

" ఈజీ అనితా!" అంది ఒలివియా ఆమెని సమాధానపరుస్తూ.

" ఆలివర్! వాటె ప్లెజంట్ సర్ప్రైజ్!. కం సన్! ప్లీజ్ జాయిన్ అజ్ !' " అన్నాడు అరుణ్ ఆలివర్ ని దగ్గరకు తీసుకుంటూ. అతను తనతో తెచ్చిన బొకేని ఇచ్చాడు. వారిద్దరూ దాన్ని ఆనందంగా తీసుకున్నారు.

"గాడ్ బ్లెస్ యూ మై చైల్డ్" అంది ఒలివియా అతన్ని దగ్గరకు తీసుకుంటూ.

" ఆలివర్ అంటే వీళ్ళిద్దరికీ ఎందుకింత ఇష్టమో? నాకు ఇప్పటికీ అర్థం కాదు" తనలో తనే గొణుక్కుంటున్నట్టుగా అంది. అందమైన ఆమె తెల్లటి ముఖం ఎర్రబడింది.

" రండి, అంతా రెడీ" అన్నాడు ఆలివర్. మ్యూజియం వైపుకి దారితీస్తూ. మ్యూజియంలోకి సందర్శకులని అనుమతించే సమయం దాటిపోయింది.

" ఆలివ్! షిప్ హాల్లోనా? లేక రెస్టారెంట్ లొనా?" అడిగాడు నీల్

" రెస్టారెంట్, చిన్న పార్టీ కదా! అదే బావుంటుంది కదా!" అన్నాడు ఆలివర్.

" రైట్! పదండి వెళదాం" అన్నాడు నీల్. వాసా షిప్ మ్యూజియం లో సందర్శకులు వెళ్ళిపోయిన తర్వాత, ప్రైవేట్ పార్టీలని అనుమతిస్తారు. అవి తమ ఇష్టప్రకారం రెస్టారెంట్ లో కానీ, షిప్ హాల్ లో కాని నిర్వహించుకోవచ్చు.

" పార్టీ ఏమిటి? ఎందుకు? అడిగింది ఒలివియా

లోపల ఎంతో అద్భుతంగా ఉంది. దాదాపు నూట ఎనభై మంది పట్టే ఆ రెస్టారెంట్ లో టేబిల్స్ అన్నీ నీట్ గా వేసి ఉన్నాయి. అన్నింటిమీద కేండిల్స్ వెలుగుతున్నాయి.

లోపల చీకటిగా ఉండడంతో అప్పటికే వీరి రాక ఎదురుచూస్తున్న ఎనభైమంది అతిధులు కనబడలేదు. అరుణ్ కుటుంబం లోపలకి అడుగు పెట్టగానే వారందరూ ఒక్కసారిగా నిలబడి తమ కరతాళధ్వనులతో అరుణ్, ఒలివియా దంపతులకి ముప్ఫైయవ వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియచేశారు. సంబరంగా పార్టీ మొదలయింది. కేక్ కటింగు జరిగింది, అందరి కేరింతలూ, ఆనందోత్సాహాల మధ్య పార్టీ ముగిసింది

అతిధులందరూ ఏర్పాట్లూ, భోజనాలు చాలా బావున్నాయని మెచ్చుకుంటూ, వాళ్ళ కుటుంబం ఎప్పుడూ ఇలాగే సంతోషంగా ఉండాలని కోరుకుంటూ శలవు తీసుకున్నారు. చివరికి ఆ పెద్ద హాలులో అరుణ్, ఒలివియా, పిల్లలూ కాక ఆలివర్, అతని అమ్మా మాత్రమే ఉన్నారు.

" థాంక్ యూ , ఆలివర్ ఫర్ ద పార్టీ" అన్నాడు నీల్.

" వాట్! ఆలివర్ ఇచ్చాడా పార్టీ ?"అంది ఒలివియా

" అవునమ్మా, కలకాలం సాగే దాంపత్యబంధాలంటే తనకున్న ఇష్టం, గౌరవం తో మీ ముప్పై సంవత్సరాల వివాహ జీవితానికి తానిచ్చే చిన్న కానుకగా భావించమని మరీ, మరీ అడిగేసరికి కాదనలేకపోయాం" అన్నాడు నీల్.

" థాంక్ యూ మై సన్" అంది ఒలివియా మనస్ఫూర్తిగా.

అరుణ్ కూడా ఆలివర్ చేతిని మెత్తగా నొక్కి తన కృతజ్ఞతని ప్రకటించాడు. అందరి ముఖాల్లోనూ విరుస్తున్న సంతోషం. ఒక్క అనిత ముఖంలో తప్ప.

" ఐ నో వై యూ ఆర్ డూయింగ్ ఆల్ దిస్" అంది అనిత కోపంగా.

" ప్లీజ్ అనిటా. ఒక్కసారి అతను చెప్పేది విను" అంది ఆలివర్ వాళ్ళ అమ్మ ఏలిస్.

" సారీ, ఐ డోంట్ నీడ్ టు" అంది అనిత కోపంగా.

"అనితా! ప్లీజ్" అన్నాడు అరుణ్ కూతురి చెయ్యి పట్టుకుంటూ.

" ఆలివర్ తప్పు చేశాడు అని నువ్వు అనుకుంటే అతన్ని ఎందుకు చేశావు అని అడుగు? కారణం తెలుసుకో! వీలైనంత త్వరలో సరిదిద్దుకుంటాడు. అంతే కాని దైవ సాక్షిగా చేసుకున్న వివాహాన్ని కేవలం విడాకులు అన్న ఒక సౌలభ్యం ఉందన్న కారణాన తొందర పడి రద్దు చేసుకోవడం మంచిది కాదు తల్లీ!" అన్నాడు నెమ్మదిగా.

" ఇన్నేళ్ళనించీ ఎంతో ఆదర్శప్రాయమైన జంటగా ఉన్న మీ తల్లితండ్రులని చూసైనా నువ్వు నేర్చుకోవాలి కదా అనిటా?" అంది ఏలిస్.

"ప్లీజ్!! ఆలివర్ మా నాన్నలా ఉంటే నేను అసలు అతన్ని వదిలి వచ్చేదాన్నే కాదు" అంది అనిత కోపంగా.

" అదే తప్పు! నేను తండ్రిగా నీకు గొప్పగా కనిపించవచ్చు, కానీ భర్తగా నాలో ఎన్నో లోపాలుండవచ్చు, అవి మీ అమ్మకి తప్ప మరెవరికీ తెలియవు కదా! ఒకరినొకరు తెలుసుకుని, తప్పొప్పులు సర్దుకుని చివరివరకూ తోడు గా ఉండడమే వివాహం యొక్క అర్థం"

" అవును అనీ!! మీ ఇద్దరి మధ్యనా ఏం జరిగిందో మేం ఎవ్వరం అడగం, మీరిద్దరూ పెద్దవాళ్ళు. అన్నీ తెలిసిన వాళ్ళు. ఏరి కోరి ఆలివర్ ని చేసుకున్నావు నువ్వు, ఆరునెలల్లో ఏం జరిగింది? అని నిన్ను నువ్వు ప్రశ్నించుకో. జవాబు దొరుకుతుంది. ఇద్దరూ కలిసి మాట్లాడుకుంటే తెలుస్తుంది సమస్య ఏమిటో? అంతగా పరిష్కరించలేనిది అయితే అప్పుడే ఆలోచించవచ్చు. నీ వ్యక్తిగత విషయాల్లో తల దూరుస్తున్నామని అనుకోకు.

ఆలివర్ వాంట్స్ యూ బాక్, నీ బ్రదర్స్ ఇద్దరితో తనే మాట్లాడాడుట. స్వీడన్ దేశంలో భార్యాభర్తల్లో ఏ ఒక్కరికి విడాకులు కావాలన్నా దానికోసం ప్రయత్నించవచ్చు. కానీ ప్రయత్నించే ముందు కలిసి ఉండే ప్రయత్నం తప్పక చెయ్యాలి, నిజానికి కోర్టు కూడా మీకు అదే చెప్తుంది, కానీసం ఆరునెలలు వేచి ఉండమని. ఎందుకంటే ఆలివర్ కి ఇష్టం లేదు కదా!. అందుకే బేబీ, మరొక్క అవకాశం ఇవ్వడంలో తప్పులేదు" అంది ఒలివియా.

" యెస్, అనీ! నువ్వు ఇందాకా అడిగావు కదా నాన్నని, భారతీయత వల్లనా నీకింత కమిట్ మెంట్ అని? నాన్న తన అభిప్రాయం చెప్తూ ఏమన్నారు? భారతీయత ఒకపక్క, వ్యక్తిగా తన నైజం మరొక పక్కా అని. ఆ రెండు మనం ఆయన దగ్గరనించి వారసత్వంగా పొందాం కదా, ఇంత మంచివాడైన ఆలివర్ ని అర్థం లేని అనుమానాలతో దూరం చేసుకోకు. హీ వజ్ డియర్ ఫ్రెండ్ టు ఆల్ ఆఫ్ అజ్, బిఫోర్ హి బికేం ఫేమిలీ" అన్నారు నీల్, లూకాస్ కూడా.

అప్పటికే మోకాళ్ళ మీద్ కూర్చుని అనిత చేతిని తన చేతిలోకి తీకున్నాడు ఆలివర్. అందరూ నవ్వారతన్ని చూసి, అనిత ముఖంలోకి నెమ్మదిగా వచ్చింది చిరునవ్వు..

" ఏ దేశమైనా ఆకాశమొకటే, ఏ జంటకైన అనురాగమొకటే" పాట మదిలో మెదిలి నవ్వుకున్నాడు అరుణ్.

COMMENTS